రోడ్డు పనులకు రాజకీయ గ్రహణం

- ఆక్రమణకు గురైన 80 అడుగుల రోడ్డు
- అధికారులు మార్కింగ్ వేసి నోటీసు లిచ్చినా స్పందించని ఆక్రమణదారులు
- రోడ్డు క్లియరెన్స్ బాధ్యత రెవెన్యూ వారిదే అంటున్న పంచాయితీరాజ్ శాఖ అధికారులు

బండిఆత్మకూరు మెయిన్ రోడ్డు పనులకు రాజకీయ గ్రహణం పట్టింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా అధికారుల ఉదాసీన వైఖరితో ఇంతవరకు పనులూ ప్రారంభించ లేదు. 80 అడుగుల రోడ్డును కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేసుకోవడంతో వాటిని తొలగించేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – బండిత్మకూరు



అక్రమణకు గురైన రోడ్డు

బండిఆత్మకూరు మండల కేంద్రంలోని భవిష్య స్కూల్ సెంటర్ నుంచి సంతమార్కెట్ వరకు రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయడం.. పనులు చేపట్టకపోవడంతో వెనక్కి వెళ్లడం పరిపాటిగా మారింది. ఇందుకు రాజకీయ జోక్యమే కారణమని తెలుస్తోంది. ఇటీవల కూడా దాదాపు 200 మీటర్ల రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. అయినా ఇంత వరకు పనులు ప్రారంభించలేదు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం 80 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డు అక్రమణలకు గురై ఇపుడు కనీసం 15 అడుగుల వెడల్పు కూడా లేదు. ఊరిలోకి వెళ్లడానికి ఇదే ప్రధాన మార్గం కావడంతో గ్రామంలోకి పెద్ద వాహనాలు వెళ్లాలంటే నరకప్రాయమే. ఒక వాహనం ఊరిలోకి వెళ్తే ఇంకో వాహనం సంతమార్కెట్ వద్దే ఆగాల్సిన పరిస్థితి కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మండల కేంద్రంలోనే ఇలాంటి పరిస్థితి ఉన్నా అధికారుల సమన్వయ లోపంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు.

రాజకీయ జోక్యంతో అక్రమణల తొలగింపులో జాప్యం

రోడ్డు విస్తరణకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా గ్రామంలోని రాజకీయ నాయకుల జోక్యంతో ఆక్రమణల తొలగింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఫలితంగా ఇంతవరకు పనులు మొదలు కాలేదు. గ్రామ సచివాలయ అధికారులు మార్కింగ్ వేసి, ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి చాలా కాలం అయినా ఫలితం లేదు. ఇటీవలే ఆత్మకూరు పంచాయతీ రాజ్ డీఈ ఆయాజ్ అహ్మద్, ఏఈ వెంకటరాముడు సైతం మండల కేంద్రాన్ని సందర్శించి స్థానిక నాయకులతో మాట్లాడిన తర్వాత కూడా ఆక్రమణలను తొలగించకుండా ఇరువైపులా అర్ధమీటర్ చొప్పున వెడల్పు చేసి రోడ్డును వేయాలనే నిర్ణయానికొచ్చినట్లు సమాచారం.



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఈ ఆయాజ్ అహ్మద్, ఏఈ వెంకట రాముడు, పంచాయతీ కార్యదర్శి అక్బర్ తదితరులు(ఫైల్)

ప్రజల నుంచి వ్యతిరేకత

80 అడుగుల రోడ్డు పూర్తిగా ఆక్రమణలకు గురై ప్రస్తుతం 15 అడుగులు చేరింది. ఆక్రమణలను తొలగించాల్సిన అధికారులు ఆక్రమణదారులకు వంత పాడుతూ రోడ్డుకు ఇరువైపులా అర మీటర్ పెంచి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఉచిత సలహా ఇవ్వడంతో ప్రజల నుంచి వ్యతిరేక వ్యక్తమవుతోంది. ఆక్రమణలను తొలగించి రోడ్డును యథాతథంగా వేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

క్లుప్తంగా

ఆధార్ నమోదులో నిర్లక్ష్యం వహించొద్దు



ఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: ఆధార్ నమోదులో నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయంలో చేపట్టిన కొత్త ఆధార్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు నమోదులో వివరాలు పూర్తిగా ఉండాలని, ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నాగశేషులు ఉన్నారు.

కుమారస్వామికి విశేషపూజలు



పూజలందుకున్న కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

సంపద తయారీ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీఓ



సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుమిత్రమ్మ

పాములపాడు: మండలంలోని నెహ్రూనగర్, కొత్తముచ్చుమర్రి గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన సంపద తయారీ కేంద్రాలను ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఈఓపీఆర్డీ నాగేంద్రయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 రోజుల్లోగా వినియోగంలోకి తెచ్చేందుకు ప్రణాళికను సిద్ధ చేస్తున్నామన్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు కాశీం, వీరన్నయాదవ్ ఉన్నారు.

పూర్వ విద్యార్థి ప్రింటర్ విరాళం



హెచ్‌ఎంకు ప్రింటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థి

వెలుగోడు: మండల పరిధిలోని వేల్పనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి గాంతి శ్రీనాథ్ రెడ్డి ప్రింటర్, స్కానరు విరాళమిచ్చారు. రూ.12,000 విలువైన ప్రింటర్, స్కానర్‌లను మంగళవారం హెచ్‌ఎం బాబా మస్తాన్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్ రెడ్డి, ఎం.శేషయ్య, ఓబులేసు, సురేష్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రేపు ఉల్లాస్ వలంటీర్లకు శిక్షణ

పగిడ్యాల: ఈనెల 23న స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ వలంటీర్లకు శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ సుమిత్రమ్మ తెలిపారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ ఎంపికైన వలంటీర్లు ఉదయం 10.30 గంటలకు వెలుగు కార్యాలయం చేరుకోవాలన్నారు.

విరాళాలు సేకరిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం



మాట్లాడుతున్న ఇస్కాన్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): ఇస్కాన్ పేరుతో మందిర నిర్మాణం కోసం విరాళాలు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇస్కాన్ పర్యవేక్షకులు రఘువంశ రాందాస ప్రభు భక్తులకు తెలియజేశారు. ఎస్‌బీఐ కాలనీలోని ఇస్కాన్ ప్రచార మందిరంలో మంగళవారం వారు మాట్లాడుతూ నంద్యాలలో తాము ఇస్కాన్ మందిరం నిర్మించడం కానీ, విరాళాలు సేకరించడం కానీ చేయడం లేదన్నారు. కొందరు వ్యక్తులు ఇస్కాన్ భక్తుల వేషధారణలో మందిర నిర్మాణం చేస్తున్నామంటూ విరాళాలను సేకరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటి వారి పట్ల భక్తులు జాగ్రత్త వహించాలని, ఎవరైనా ఇస్కాన్ పేరుతో భక్తుల ఇంటి వద్దకు వస్తే తమకు(8977488848) తెలియజేయాలని సూచించారు.

పట్టణాభివృద్ధికి కృషి



ఐ లవ్ ఆత్మకూరు సింబల్ వద్ద ఫొటో దిగుతున్న అధికారులు, నాయకులు

ఆత్మకూరు: పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రషీద్, కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. కొత్త బస్టాండు వద్ద ఐ లవ్ ఆత్మకూరు బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అందులో భాగంగా కొత్తబస్టాండ్ వద్ద సెల్ఫీ ప్లేస్‌గా ఐ లవ్ ఆత్మకూరు బోర్డును ఏర్పాటు చేశామన్నారు.

26న ఫుట్‌బాల్ బాలుర ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 26న జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్పీజీ క్రీడా మైదానంలో సీనియర్ ఫుట్‌బాల్ బాలుర ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు వినయ్‌సాగర్, సెక్రటరీ ఏ.అనిల్‌కుమార్ మంగళవారం తెలిపారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ఎంపికైన ఫుట్‌బాల్ క్రీడాకారులు కర్నూలులో జరిగే లీగ్ సీనియర్ ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో పాల్గొంటారన్నారు. ఫుట్‌బాల్ ఎంపిక పోటీలకు ఫుట్‌బాల్ కిట్టుతో హాజరు కావాలని తెలిపారు. మరింత సమాచారం కోసం ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వినయ్‌సాగర్ సెల్: 9963636876కు సంప్రదించాలన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆత్మకూరు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ తెలిపారు. మండలంలోని కురుకుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. గుట్కా, ధూమపానం, మద్యపానం అలవాట్లు ఉన్న వారికి, పౌష్టికాహార లోపం ఉన్నవారికి క్షయవ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు యోగ, వ్యాయామం చేయడం వల్ల అనారోగ్యాల బారిన పడకుండా ఉంటారన్నారు. హెచ్‌ఎం వెంకటస్వామి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత, ఆహారపు అలవాట్లు, వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్వరి, చెన్నమ్మ, వెంకటరమణ పాల్గొన్నారు.



క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

వెలుగోడు: గ్రామాల్లో ఏర్పాటు చేసే పశువైద్య శిబిరాలు పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారిణి జ్యోత్స్నదేవి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రేగడ గూడూరు గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు పంపిణీ, గర్భకోశ వ్యాధులు, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. శిబిరంలో వీఎల్‌ఓ విశ్రాంతమ్మ పాల్గొన్నారు.



జీవానికి చికిత్స నిర్వహిస్తున్న వైద్యాధికారిణి జ్యోత్స్నదేవి

వసంత పంచమిని విజయవంతం చేద్దాం

- ఎమ్మెల్యే గిత్త జయసూర్య

కొత్తపల్లి: అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఫిబ్రవరి 2న జరిగే వసంత పంచమి వేడుకలను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. మంగళవారం మండలంలోని కొలనుభారతిదేవి ఆలయ ప్రాంగణంలో దేవదాయ శాఖ జిల్లా ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ మోహన్, ఆలయ ఈఓ రామలింగారెడ్డిల ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేడుకలు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ ఉమారాణి, ఎస్ఐ కేశవ, ఎంపీడీఓ మేరి, వైద్యుడు విజయేంద్ర, వెలుగు ఏపీఎం పుల్లయ్య, సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

ఆధార్ సేవలు వేగవంతం చేయండి

జూపాడుబంగ్లా: ఆధార్ సేవలు వేగవంతం చేసి ప్రతి రోజూ కనీసం వంద మంది లబ్ధిదారులకు ఆధార్‌సేవలు అందేలా చూడాలని ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. మంగళవారం జూపాడుబంగ్లా అంగన్‌వాడీ కేంద్రం-2లో ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆధార్‌సెంటర్ నిర్వాహకుడు రాముడితో మాట్లాడుతూ ఆధార్ సేవలు అందించినందుకుగాను నిర్ణీత రుసుము మాత్రమే తీసుకోవాలన్నారు. అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గోపికృష్ణ

సకాలంలో విధులకు హాజరు కావాలి

కొత్తపల్లి: సకాలంలో విధులకు హాజరు కావాలని ఎంపీడీఓ మేరి సచివాలయ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని దుద్యాల సచివాలయాన్ని తనిఖీ చేసిన అనంతరం డ్రైనేజీలపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. హాజరు, రికార్డులు, రిజిస్టర్లలో తప్పులేకుండా చూసుకోవాలని సూచించారు. నిర్మాణాల నాణ్యతలో రాజీ పడొద్దన్నారు.

మహానందీశుడి దంపతులకు కల్యాణోత్సవం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు మంగళవారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, అంజనేయశర్మ, శాంతారాంభట్‌లు స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్త పూజలు చేశారు. పలు ప్రాంతాల భక్తులు కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి స్వామి, అమ్మవారి అనుగ్రహం పొందారు.

ముగిసిన వేలంపాటలు

కొత్తపల్లి: మండలంలోని కొలనుభారతిదేవి ఆలయంలో మంగళవారం ఈఓ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో దేవదాయ శాఖ తనిఖీ అధికారి హరిచంద్రరెడ్డి పర్యవేక్షణలో దుకాణాల ఏర్పాటుకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఫొటోల విక్రయ హక్కులకు రూ.19 వేలు, గాజుల అంగడికి రూ.6 వేలు, బొమ్మలు అమ్ముకొనేందుకు రూ.6 వేలు, కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌కు రూ.24,500, బెల్లం చెరుకులు, కలింగర పండ్లకు రూ.9 వేలు, అమ్మవారి ఫొటోలకు రూ.15,000లకు పాటదారులు దక్కించుకున్నారు. గత ఏడాది అన్ని అంగళ్లకు గాను రూ.74,500 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.79,500 వచ్చినట్లు అధికారులు తెలిపారు. పాటదారులు 2026 వసంత పంచమి వరకు వ్యాపారాలు నిర్వహించుకునే హక్కు ఉంటుందన్నారు. అలాగే 10 నెలల కాల వ్యవధిలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.3,21,821 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటనాయుడు, ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ పాల్గొన్నారు.



ఆలయ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

గ్యాస్ సిలిండర్లు సీజ్

పాములపాడు: స్థానిక హోటళ్లలో 7 సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసినట్లు ఆర్ఐ ఖాజాబీ మంగళవారం తెలిపారు. ఈనెల 20న రాత్రి విజిలెన్స్ అధికారులు విశ్వనాథ్, సిద్దయ్య తనిఖీలు నిర్వహించగా 3 హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను జప్తు చేసి తమకు స్వాధీనం చేశారన్నారు. హోటళ్ల యజమానులపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేడు నారాయణాపురంలో ఆధార్ క్యాంప్

బండిఆత్మకూరు: మండల పరిధిలోని నారాయణాపురం గ్రామంలో బుధవారం ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమా దేవి తెలిపారు. పుట్టిన పిల్లల నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు ఆధార్ నమోదు చేయనున్నట్లు తెలిపారు.

ఈ- శ్రామ్ పోర్టల్ రిజిస్ట్రేషన్ చేసుకోండి

వెలుగోడు: అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు ఈ- శ్రామ్ పోర్టల్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అసంఘటిత కార్మికులందరూ నమోదు చేసుకోవాలని ఆత్మకూరు సహాయ కార్మిక అధికారిని సారా మార్గరెట్ సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు, వలస కార్మికులు, ఇళ్లలో పనిచేసేవారు, వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, మత్స్య కార్మికులు, ఉపాధి వేతనదారులు, లఘు వ్యాపారులు తదితర కార్మికులందరూ ఈ- శ్రామ్ పోర్టల్‌లో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదవశాత్తూ ఏదైనా ఘటనలు జరిగితే ఒక్కొక్క వ్యక్తికి రెండు లక్షల రూపాయల పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎనిమిది మంది కార్మికులకు రూ.16 లక్షలు చెల్లించినట్లు చెప్పారు.

పశువులకు ఉచిత వైద్యం

నందికొట్కూరు: పశువులకు రోగ నిరోధక శక్తి పెంచేందుకు ప్రభుత్వం పశు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు పశువైద్యాధికారి డాక్టరు నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య వైద్య శిబిరంలో పశువులకు నట్టల నివారణకు మందు, టీకాలు ఉచిత వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవులకు, గేదెలకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు తాగించినట్లు తెలిపారు. ఎదకు రాని, ఆరోగ్యం సరిగ్గా లేని పశువులకు చికిత్సలు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచు నవీన్‌బాబు పాల్గొన్నారు.

ఆధార్‌లో తప్పలకు తావివ్వొద్దు

వెలుగోడు: ఆధార్ నమోదులో తప్పులు లేకుండా చూడాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని గండిపేటలో ఆధార్ సెంటర్‌తోపాటు అంగన్‌వాడీ సెంటర్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. 6 ఏళ్ల లోపు చిన్నారులకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం విద్యార్థులకు వడ్డించాలన్నారు. పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

తీవ్రమవుతున్న చలి

జూపాడుబంగ్లా: రోజు రోజుకు చలితీవ్రత అధికమవుతుండటంతో తెల్లవారినా ఇళ్లల్లోంచి బయటకు వచ్చేందుకు గ్రామీణ ప్రజలు వణికిపోతున్నారు. ఉదయం ఆరుగంటలైనా చలితీవ్రతతోపాటు ఈదురు గాలులు వీస్తుండటంతో తప్పనిసరైన పరిస్థితుల్లో ఇళ్లల్లోంచి బయటకువచ్చిన ప్రజలు చలికి తట్టుకోలేక చలిమంటలు వేసుకొని వెచ్చదనాన్ని పొందుతున్నారు. దీనికితోడు పొగమంచు అధికంగా కురుస్తుండటంతో వ్యవసాయ కూలీపనులకు వెళ్లిన వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఏడాది ఉన్నంత చలితీవ్రత గతంలో ఎన్నడూ లేదని గ్రామీణ ప్రజలు పేర్కొంటున్నారు.

కేసీ కాల్వలో తగ్గిన నీటిమట్టం

జూపాడుబంగ్లా: కర్నూలు–కడప కాల్వలో నీటిప్రవాహం తగ్గటంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 800క్యూసెక్కులతో పాటు మల్యాల ఓ పంపుద్వారా 338క్యూసెక్కుల నీటిని కేసీ కాల్వకు సరఫరా చేస్తున్నారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం రెండు పంపులు నిలిపివేయటంతో కేసీ కాల్వలో భారీగా నీటిప్రవాహం తగ్గిపోయింది. కేసీ కాల్వలో ప్రవహిస్తున్న నీటిని రైతులు వినియోగించుకొన్న అనంతరం లాకిన్స్‌లా వరకు కేవలం 316క్యూసెక్కుల నీరు చేరుతుండగా ఈ నీటిని తూడిచెర్ల సబ్ ఛానల్ కాల్వకు సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ అధికారులు తెలిపారు. నిప్పులవాగు, ఏబీఆర్ కాల్వకు సాగునీటి సరఫరా నిలిపివేశామన్నారు. కేసీ కాల్వ వాటాగా తుంగభద్ర డ్యాం నుంచి రావాల్సిన నీటి సరఫరా కోసం అధికారులు ఇండెంట్ పెట్టి మరో వారం రోజుల్లో కాల్వకు సాగునీరు సరఫరా అయ్యేలా చేసే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. అప్పటిదాకా సాగుచేసిన పంటలకు నీటిని పారించుకోకపోతే తీవ్రమవుతున్న ఎండ తాకిడికి పంటలు దెబ్బతినే అవకాశం ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సారా విక్రయిస్తే కేసులు నమోదు

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేయడం ఖాయమని ఎక్సైజ్ శాఖ డీటీఎఫ్ ఎస్ఐ రమేష్ హెచ్చరించారు. జూపాడుబంగ్లా మండల పరిధిలోని పారుమంచాల గ్రామంలో మంగళవారం వడ్డే వెంకటేశ్వర్లు నాటుసారా అమ్ముతుండగా అరెస్టు చేసి 10 లీటర్ల సారాను సీజ్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించారు.

పశువుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం

పాములపాడు: పశువుల ఆరోగ్యం పట్ల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యాధికారి అనిల్ సూచించారు. మంగళవారం మండలంలోని రుద్రవరం గ్రామంలో పశు వైద్యశిబిరం నిర్వహించారు. 72 దూడలకు డీవార్మింగ్ మందులు, 14 పశువులకు గర్భ నిర్ధారిత పరీక్షలు, 550 గొర్రెలకు డీవార్మింగ్ మందులు, 4 యద సూదులు ఇచ్చినట్లు పశు వైద్యాధికారి తెలిపారు.

కొనసాగుతున్న కార్మికుల దీక్షలు

శ్రీశైలంప్రాజెక్ట్: ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ కోసం స్థానిక ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రం చీఫ్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. కార్మికులు ఆర్.రామసుబ్బయ్య, ఎస్.లక్ష్మి, మేరి, నారాయణ, యూసుఫ్, సత్యం దీక్షలో కూర్చున్నారు. ఏఐటీయూసీ నాయకులు మారేడు శివశంకర్, రామయ్య, బి.లక్ష్మయ్య, సీఐటీయూసీ నాయకులు కిషన్, సుబ్బారెడ్డి, టీఆర్‌ఎస్‌కేవీ నాయకులు తిమ్మన్న, శేఖర్, ప్రసాద్ తదితరులు సంఘీభావం తెలిపారు. స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం 5ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కార్మికులను విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

పంట నమోదు తప్పనిసరి

ఆత్మకూరు: సాగు చేసిన ప్రతి పంటను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని శ్రీపతిరావుపేట, పిన్నాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మినుము, మొక్కజొన్న పంటల్లో సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. గ్రామాల్లోని రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో పంటల నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. డీఆర్‌సీ ఏఓ హేమలత మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షా ఫలితాలను బట్టి ఎరువులు వాడాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులు వాడడం వల్ల భూసారం పెంచవచ్చన్నారు. పట్టు పరిశ్రమ అధికారిణి అరుణ, వ్యవసాయ విస్తరణ అధికారిణి రాజశేఖర్ పాల్గొన్నారు.

- **వెలుగోడు:** మండలంలోని మాధవరం, మోత్కూరు గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీలో సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వం అందించే రాయితీలకు అర్హులవుతారని ఆయన రైతులకు సూచించారు. ఏఈఓ సుధారాణి, సెరికల్చర్ సహాయకులు నాగలింగం పాల్గొన్నారు.

- **మల్యాల గ్రామ పొలిమేరలో..**

నందికొట్కూరు: మండల పరిధిలోని మల్యాల గ్రామ పొలిమేరలో రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వడ్డేమాన్, కోనేటమ్మపల్లి గ్రామాల్లో రబీలో శనగ, మినుము పంట పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డివిజన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు విజయశేఖర్, షేక్షావలి, సిబ్బంది రబీ సీజన్‌లో వేసిన పంటలకు బీమా కట్టించుకోవాలని రైతులకు సూచించారు.

- **గోకవరంలో..**

కొత్తపల్లి: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని గోకవరం గ్రామం రైతు సేవకేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది పంటలో పూతల పురుగు నివారణకు వేప నూనె స్ప్రే చేయాలన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే ఇండాక్సకార్బ్ 150 ఎం.ఎల్, అవాంట్ క్లోరంత్రోలిప్రోల్ 150 ఎం.ఎల్,స్పైనోసాడ్ 125–162 ఎం.ఎల్ ఒక హెక్టార్‌కు, ఇండాక్స, బెంజోయేట్, ఇండక్స్ నోవాల్యురాన్, ఫ్లీతోర మార్చి మార్చి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెరికల్చర్ ఏఎస్ఓ లింగమూర్తి, ఎంపీఈఓ ఇమ్రాన్, ఏహెచ్ఏ అయ్యమ్మ పాల్గొన్నారు.

- **ఈర్నపాడులో..**

బండిఆత్మకూరు: మండల పరిధిలోని ఈర్నపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎం.స్వాతి మాట్లాడుతూ వరి పైరుకు అధిక మోతాదులో యూరియా వాడితే భూసారం కోల్పోతుందన్నారు. యూరియాను తగిన మోతాదులో వాడాలని రైతులకు తెలిపారు.

- **తంగడంచ గ్రామంలో..**

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ కృష్ణారెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలను ఈపంట నమోదు చేయించుకోవటంతో పాటు క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. కంది పంట సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు తెలియజేశారు. కంది పంట నూర్పిళ్లు పూర్తి చేసుకున్న రైతులు కందుల విక్రయానికి రైతుసేవాకేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతుసేవా వీహెచ్ఏ వెంకటేష్ పాల్గొన్నారు.



నందికొట్కూరు: వడ్డేమాన్ సమీపంలోని శనగ పైరులో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

- **గోపవరం గ్రామంలో..**

మహానంది: మండల పరిధిలోని గోపవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే ఉత్పత్తులు, దిగుబడులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు బాలాజీ నాయక్, సతీష్ పాల్గొన్నారు.